క్లుప్తంగా

నేడు వైజ్ఞానిక ప్రదర్శన

ఐ.పోలవరం: మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఎం.కొండారెడ్డి, కె.తిరుమలరావులు సోమవారం తెలిపారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ ప్రదర్శనలో 8 నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం పాల్గొన వచ్చని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక కోస్టల్ బ్యాంక్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బ్యాంక్‌లో సోమవారం జరిగిన రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంక్ ఖాతాదారులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన వారికి కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. కంటి వైద్యు నిపుణులు డాక్టర్ ఊటాల ప్రభాకర్ ఖాతాదారులకు పరీక్షలు చేసి సేవలు అందించారు. బ్యాంక్ మేనేజర్ చెదులూరి శివాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 25 ఏళ్లలో బ్యాంక్ అభివృద్ధి గురించి వివరించారు. కొత్త డిపాజిట్ల పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ, సెల్ రేడియేషన్‌పై అవగాహన



సదస్సులో అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

ముమ్మిడివరం: సెల్ రేడియేషన్ ప్రభావం వల్ల అనేక మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని ఎంపీడీఓ తాడి వెంకటాచార్య సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఫిజియోథెరపీ, సెల్ రేడియేషన్‌ల వల్ల కలిగే అనర్థాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఫిజియోథెరపీ శిక్షకులు రమేష్, సంతోష్‌లు హాజరైన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ లక్ష్మీ కల్యాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక శ్రీరామ నగర్‌లో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం కోశాధికారి రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు గుబ్బల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి అల్లుమిల్లి శ్రీను బాబు, ఉపాధ్యక్షులు ఎండీ నాగ ప్రసాద్, జీవీ రమణ, నగభేరి కృష్ణమూర్తి, సంఘం అమలాపురం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జీపీ శెట్టి, పి.సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగపై చర్యలకు డిమాండ్

ఉప్పలగుప్తం: మాల, మాదిగలను విడదీసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మండల మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణకు సోమవారం ఫిర్యాదును అందించారు. కార్యక్రమంలో మండల మహానాడు అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, గెద్దాడ బుద్ధరాజు, పెయ్యిల బాలకృష్ణ, పి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమలాపురం టౌన్: స్థానిక మద్దాల వారిపేట సమీపంలో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుబ్బల వెంకటేశ్వరరావు (34) సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వెంకటేశ్వరరావు, అతని బంధువుతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా మరో మోటారు సైకిల్ వెనక నుంచి వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మోటారు సైకిల్ నడుపుతున్న స్థానిక విత్తనాల వారి కాల్వగట్టుకు చెందిన వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మొక్కుబడి సదస్సులు



విలసవిల్లి రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ దివాకర్



గోడిలంకలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు చేస్తున్న స్థానికుడు తులసీరావు

- గ్రామాల్లో తుస్సుమంటున్న రెవెన్యూ సదస్సులు
- ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం
- సింగిల్ డిజిట్‌కే పరిమితమైన ఫిర్యాదులు

మండలం	ఫిర్యాదులు	పరిష్కారమైనవి	పెండింగ్‌లో ఉన్నవి
అల్లవరం	267	54	211
ఉప్పలగుప్తం	259	00	259
అమలాపురం రూరల్	280	19	261

అల్లవరం: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. దీర్ఘ కాలికంగా పరిష్కారం కాని సమస్యలు, మ్యుటేషన్లు, 22 ఏ జాబితా నుంచి భూములను తొలగించటం, భూ ఆక్రమణలు, రీ సర్వే, అండగల్‌లో పేరు మార్పులు, పాసు పుస్తకాల జారీ తదితర సమస్యలపై ఈ నెల 10 నుంచి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అయితే ఆశించిన స్థాయిలో ఈ సదస్సులు ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. రెవెన్యూ సదస్సులపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. దీర్ఘ కాలిక సమస్యలకు పరిష్కార వేదికైన రెవెన్యూ సదస్సులలో ఫిర్యాదు చేసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించలేదు. కేవలం దండోరాతో సరిపెట్టుకున్నారు. దీంతో ఈ సదస్సులపై అవగాహన లేక చాలా మంది హాజరు కాని పరిస్థితి నెలకొంది.

ఉత్తుత్తి హడావిడే..

ఈ నెల 10న అట్టహాసంగా ప్రారంభమైన రెవెన్యూ సదస్సులలో ఫిర్యాదులు ఇవ్వడానికి గ్రామస్తులు ముందుకు రాకపోవడంతో సింగల్ డిజిట్‌కే ఫిర్యాదులు పరిమితమయ్యాయి. దీనికి కారణం ఆయా గ్రామాల్లో సమస్యలు లేక కాదు. రెవెన్యూ సదస్సుల గురించి ప్రజలకు సరియైన అవగాహన లేకపోవడం, తెలియకపోవడమే ప్రధాన కారణం. సదస్సుల్లో ప్రతి గ్రామం నుంచి మ్యుటేషన్‌లపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూమి ఆక్రమణకు గురైందని, తమ భూమి వేరే వాళ్ల రికార్డుల్లో ఉందని, వేరే వాళ్ల భూమి తాలూకా పన్నులను తమ ద్వారా వసూలు చేస్తున్నారని, రికార్డుల్లో తప్పులు, రీప్లేస్‌మెంట్ పాసు పుస్తకం, సర్వే, మ్యూటేషన్‌లో సవరణ, ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు ఎక్కువగా నమోదయ్యాయి. ఇప్పటి వరకు మ్యుటేషన్, రీ ప్లేస్‌మెంట్ పాసు పుస్తకాల జారీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదులకు మాత్రమే పరిష్కారాలు చూపుతున్నారు. సర్వే, మ్యుటేషన్ సవరణపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో..

అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా అల్లవరంలో 267, ఉప్పలగుప్తంలో 259, అమలాపురం రూరల్ పరిధిలో 280 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలకు ముందస్తు సమాచారం లేక రెవెన్యూ సదస్సులు వెలవెలబోయాయి. ఫిర్యాదులు కూడా సింగిల్ డిజిట్‌లకే పరిమితమయ్యాయి. అల్లవరం మండలంలో గోడితిప్పలో 4, ఓడలరేవులో 6, ఎస్.పల్లిపాలెంలో 2, ఉప్పలగుప్తం మండలం నంగవరంలో 6 ఫిర్యాదులు నమోదయ్యాయి. అమలాపురం రూరల్ పరిధిలోని భట్నవిల్లి చెరువు భూమిలో రియల్ ఎస్టేట్ యజమానులు కబ్జా చేశారని ఓ రియల్ వ్యాపారి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

నిర్ణీత వ్యవధిలో పరిష్కారం



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను 30 రోజుల కాల వ్యవధిలో పరిష్కారం చేయాల్సి ఉంది. మా పరిధిలో పరిష్కారం కాని ఫిర్యాదులను జేసీకి పంపించడం జరుగుతుంది. సరైన డాక్యుమెంట్లు ఇవ్వకపోతే మ్యుటేషన్ సవరణ ఫిర్యాదులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది.

వీవీఎల్ నరసింహారావు, తహసీల్దార్, అల్లవరం

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు

- శిథిలావస్థకు చేరిన పాఠశాలను తక్షణం మార్చండి
- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ వినతి పత్రం



జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: మండలంలోని పేరూరు వై జంక్షన్‌లో జాతీయ రహదారి చెంతన గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిల స్థితికి చేరుకుని ప్రమాదకరంగా మారిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఎమ్మెల్సీ స్వయంగా వెళ్లి కలెక్టర్‌తో ఈ సమస్యపై చర్చించి వినతి పత్రం ఇచ్చారు. శిథిల భవనం నుంచి స్లాబ్ పెచ్చులు ఊడి పడడం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. భవనం ఏ క్షణానైనా కూలే అవకాశం ఉన్నందున పాఠశాలను అక్కడ నుంచి మార్చాలని కలెక్టర్‌ను ఎమ్మెల్సీ కోరారు. జాతీయ రహదారి చెంతనే పాఠశాల ఉండడం వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు విలేకరులకు తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్య నారాయణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల విషయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా సామాన్యులపై బిల్లుల భారాన్ని మోపడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లుల బాదుడును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరరావు, కొల్లా రాంబాబు, గిడ్డ రాంబాబు, ఎం.శివ, సాధనాల రామకృష్ణ, పితాని బేబీరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



ప్రభాకరరావును సత్కరిస్తున్న ఎస్పీ రాజశేఖరన్, ఎస్సైలు

యానాం: ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎస్పీ రాజశేఖరన్ అన్నారు. యానాం పోలీస్ శాఖలో ఎస్సైగా 35 ఏళ్ల పాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన జిల్లెళ్ల ప్రభాకరరావు ఉద్యోగ విరమణ సభకు ఆయన హాజరయ్యారు. ప్రభాకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, ఏఎస్సైలు కవల రవణమూర్తి, పట్టాభి, కడలి మధు, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, వివిధ ఎస్సీ ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాలు, అంబేడ్కర్ నగర్, మెట్టకూరు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపక దళంలో ఖాళీగా ఉన్న ఫైర్ స్టేషన్ ఆఫీసర్(లెవెల్–5) ఉద్యోగాలకు ఈ నెల 29న నిర్వహించిన పోటీ పరీక్ష ఫలితాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పంకజ్‌కుమార్ ఘా సోమవారం విడుదల చేశారు. పురుషుల విభాగం నుంచి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేటగిరీలో కోన వీరబాబు, ఎంబీసీ నుంచి ఉమా మహేశ్వరి, జనరల్ కేటగిరీ నుంచి జయశ్రీ ఎంపిక కాగా మరో అయిదుగురు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు

తాళ్లరేవు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు సమస్యలపై ధ్వజమెత్తారు. ప్రధానంగా తమ గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వడం లేదని, రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆదేశాల మేరకు గ్రామాలలోని అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలపై సంతకాలు చేసామని, అయితే ఆయా పనులకు సంబంధించి అధికారులు కనీసం సమాచారం ఇవ్వలేదని ఇంజరం ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి పంచాయతీరాజ్ ఏఈని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులను పట్టించుకోవడం లేదని సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జి.వేమవరం, కోరంగి, సుంకరపాలెం, గాడిమొగ ఎంపీటీసీ సభ్యులు యర్రంనీడి అప్పారావు, పోతుల రత్నకుమారి, గుత్తుల శ్రీను, కామేశ్వరరావు తదితరులు తమ ప్రాంతంలో జరుగుతున్న పరిస్థితిని వివరించారు. గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు విధిగా స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీపీ సునీత ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ త్రినాథరావు, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, సర్పంచ్‌లు టిళ్లపూడి నాగేశ్వరరావు, పెయ్యల మంగేష్, పంపన రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని షాదీఖానా భవనంలో సీపీఐ పార్టీ శత వార్షికోత్సవ సభ సోమవారం జరిగింది. అనంతరం పుర వీధుల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలు చేత పట్టి ర్యాలీ చేపట్టారు. షాదీఖానా భవనంలో జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జిల్లా పార్టీ కార్యదర్శి కె.సత్తిబాబులు మాట్లాడుతూ కార్మిక, కర్షక ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటాలు, ఉద్యమాలు చేసేది సీపీఐ పార్టీయేనని గుర్తు చేశారు. శతాబ్ది కాలంలో పార్టీ నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలతో పాటు సాధించిన విజయాలను పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ గుర్తు చేశారు. పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు మోకా శ్రీనివాసరావు, కాళ్ల భీమరాజు, వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్, బండారు బాలకృష్ణ తదితరులు సభలో ప్రసంగించారు.

బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని అంబేడ్కర్ కోనసీమ బేడ బుడగ జంగాల జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పలగుప్తం మండలాధ్యక్షుడు పెర్ల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇవ్వడానికి అధికారులు తమకు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఎస్సీల్లో మాల, మాదిగ, రెల్లి కులాలకు ఇచ్చినట్లే బుడగ జంగాలకు కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు ముగ్గ పెద్దిరాజు, ముగ్గ పిచ్చియ్య, పేర్ల మరడియ్య, పేర్ల కిరణ్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో తమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

ముమ్మిడివరం: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ముమ్మిడివరం తాలుకా రజక సంఘ సమావేశం విజ్ఞప్తి చేసింది. స్థానిక రజక సంఘ భవనంలో సోమవారం రజక సంఘ సమావేశం జరిగింది. రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని సభ్యులు కోరారు. నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా సామంతకుర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ముమ్మిడివరపు వెంకన్నబాబు, కార్యదర్శిగా అవిడి సత్యనారాయణ, ట్రెజరర్‌గా అచ్చుతమోహన్‌రావులతో పాటు కమిటీ సభ్యులు నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గొల్లపల్లి ధర్మారావును సభ్యులు సత్కరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ముమ్మిడివరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు, ప్రజా సంఘాలు

ముమ్మిడివరం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బళ్లగేటు సెంటర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద రాజకీయాలు నశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై సీపీఎం పార్టీ నిరసన వ్యక్తం చేసింది. సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అజెండా అమలులో భాగమే అమిత్‌షా వ్యాఖ్యలని విమర్శించారు. కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, వల్లు రాజబాబు, విప్పర్తి శ్రీనివాసరావు, గోడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

అమలాపురం రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సీపీఎం, సీపీఐ, దళిత ఐక్యవేదిక, కేవీపీఎస్, ఐద్వా మహిళా సంఘం తదితర సంఘాలు ధర్నాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వామపక్ష ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశ ప్రజలపై రుద్దడం కోసం అంబేడ్కర్‌పై అమిత్ షా ద్వారా ఈ వ్యాఖ్యలు చేయించిందని మండిపడ్డారు. అమిత్‌షా దేశ ప్రజానీకానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత ప్రజా సంఘాల నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

ప్రజా ఉత్సవాలకు ఆహ్వానం

యానాం: జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు స్థానిక బాలయోగి స్టేడియంలో నిర్వహించే యానాం ప్రజా ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రాన్ని సోమవారం పుదుచ్చేరిలో సీఎం రంగసామికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందజేశారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా సీఎం రంగసామితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. ముగింపు సభకు ఎల్జీ కె కైలాష్‌నాథన్ హాజరు కానున్న నేపథ్యంలో మంత్రులు లక్ష్మీనారాయణ, తేనె జైకుమార్, తిరుమురుగన్, పుదుచ్చేరి కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధస్సు వృద్ధి

ముమ్మిడివరం: విద్యార్థుల మేధస్సు, ఆలోచనా విధానాలకు కొలమానంగా వైజ్ఞానిక ప్రదర్శలు నిలుస్తాయని ఎంఈఓ బొజ్జా రమణశ్రీ అన్నారు. ముమ్మిడివరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొని వివిధ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ, ఎంఈఓ 2 ఆర్. ఉదయ్ భాస్కర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: గోడి, మొగళ్లమూరు గ్రామాల్లోని ప్రధాన చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. మొగళ్లమూరు చర్చిలో 20 మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయి రాంబాబు, మట్ట నాగేశ్వరరావు, మడికి శ్రీరాములు, యార్లగడ్డ రవీంద్ర పాల్గొన్నారు.

3న నృత్య ప్రదర్శన ఎంపిక పోటీలు

యానాం: యానాంలో జనవరి 6 నుంచి 8 వరకు స్థానిక బాలయోగి స్టేడియంలో నిర్వహించే 21వ ప్రజా ఉత్సవాలలో ప్రతిభా వంతులైన స్థానిక నృత్య కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా జనవరి 3న నృత్య పోటీలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో పోటీలను నిర్వహిస్తారన్నారు. 18 ఏళ్ల పైబడిన వారిని సీనియర్లుగా, 18 ఏళ్ల లోపు వారిని జూనియర్లుగా పరిగణిస్తారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సంఘ సభ్యులు

అల్లవరం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంతో తీవ్ర గాయాల పాలై కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుండెపూడి గ్రామానికి చెందిన వైదాడి నాగబాబు కుటుంబానికి కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం ఆదుకుంది. సంఘం ఆధ్వర్యంలో రూ. 98 వేల నగదును బాధితుడు తల్లికి సోమవారం సంఘ సభ్యులు అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగబాబుని సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ మృతి తీరని లోటు

ఉప్పలగుప్తం: దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు సూదా లక్ష్మీనారాయణ మృతి తీరని లోటని వికలాంగుల సంఘ నాయకులు అన్నారు. దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సూదా లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు నాయకులు సోమవారం గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రులో ఆయన కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగ విభాగం సభ్యుడు రాజు, సంపత్ కుమార్, చేట్ల విద్యాసాగర్, మట్టపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణం వద్ద నిరసన

ముమ్మిడివరం: బంగారు వస్తువు తయారు చేయమని బంగారం ఇచ్చి ఆరేళ్లు గడిచినా ఇంతవరకు తయారు చేసి ఇవ్వకపోవడంపై బాధితుడు దుకాణం ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్నాడు. ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామానికి చెందిన దోనూరి వెంకట రమణ స్థానిక గాయత్రి జ్యూవెలర్స్ షాపులో బంగారు గొలుసు చేయమని 13 గ్రాముల బంగారం ఇచ్చాడు. అయితే ఆరేళ్లయినా ఇంతవరకు వస్తువు తయారు చేసి ఇవ్వలేదని ఎన్ని సార్లు తిరిగినా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం షాపు వద్దకు వచ్చి మరోమారు వస్తువు కోసం అడిగితే యజమాని సమాధానం చెప్పకుండా షాపు వదలి వెళ్లి పోయాడు. దీంతో బాధితుడు వెంకట రమణ షాపు ఎదుట బైఠాయించి నిరసన కొన సాగిస్తున్నాడు.

ఫొటో గ్రాఫర్ల సమస్యలపై వినతి



చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీకి వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఇటీవల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ది అమలాపురం ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీతో సోమవారం చర్చించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కొన్నేళ్లుగా తామంతా ఇదే వృత్తిలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కట్టమూరి కృష్ణ, గౌరవ సలహాదారులు యినకోన గురు, మట్ట మోహన్, అధ్యక్షుడు చెల్లుబోయిన బాబి, ఉపాధ్యక్షుడు యల్లమిల్లి శివకుమార్, అసోసియేషన్ ప్రతినిధులు పొట్టుపోతు నాగు, ఖ్వాజాబాబు తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

అమలాపురం రూరల్: సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న దేవాంగ విద్యార్థులకు కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 3.60 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. బండారులంకలోని దేవాంగ కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షత సోమవారం సమావేశం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి పుత్సల వరదరాజు తదితరులు పాల్గొన్నారు.